# కష్టములందు, బాధలందు మనస్సును మరొకవైపు మరల్చటానికి కృషి చెయ్యండి!

**ప్రేమస్వరూపులారా!**

రాత్రివేళలందు జగత్తునకు ప్రకాశమునందించేది, చంద్రుడు. పగలు లోకమునకు ప్రకాశమునందించేది, సూర్యుడు. త్రిలోకములకు ప్రకాశము నందించేది, ధర్మము. సుపుత్రుడే కులమును వుద్ధరించటానికి తగినవాడు. 'వెలయు వనములోన మలయజంబ'న్నట్లు గుణవంతుడైన కుమారుడు తన కులమును సంరక్షించటమే కాకుండా జగత్తునకుకూడను ఆదర్శవంతుడుగా రూపొందుతాడు. కనుక, మానవత్వమునందు దివ్యత్వమును విశ్వసించి పవిత్రతను అందుకోటం కర్తవ్యము. మానవ జీవితములో ప్రధానమైనది, కాలము. ఈ అనంతమైన కాలమునందు, అగాధమైన దివ్యత్వమునందు, ఆద్యంతములు లేని పరతత్త్వమునందు ఏకత్వమును వహించటమే మానవుని ప్రధాన కర్తవ్యము.

**మానవుడు శరీరము, మనస్సు, ఆత్మలయొక్క సమ్మిళితమైన స్వరూపమే!**

మానవజీవితము కేవలము భౌతికమైన ఆనందములనిమిత్తమై రాలేదు. దేహము, మనస్సు, అహంకారము ఈ మూడింటి కలయికయే మానవుడు. ఇలాంటి మానవత్వమును సార్థకము చేసుకొనుటకై మనము తగిన కృషి చేయాలి. కర్మాచరణకు కాయము అత్యవసరము. జగత్తుయొక్క విషయములు తెలుసుకొనుటకు మనస్సు ఆధారము. ఈ రెండిటికి దృక్పథాన్ని చేకూర్చేది ఆత్మ. కనుక, ఈ మూడింటియందు వున్న అంతరార్థమును గుర్తించాలి. ఇక్కడ చేయుట, తెలుసుకొనుట, వుండుట అనే మూడును విశిష్టమైన పదములు. ఈ మూడింటి తత్త్వమే మానవాకారము. ఈ మూడింటియొక్క సమ్మిళితమైన శక్తిద్వారానే మానవత్వము బహిర్గతమవుతుంది. ఇలాంటి పరిస్థితులయందు మానవత్వము ఎంత విశిష్టమైనదో మీరు గుర్తించాలి. ఇది కేవలము విశిష్టము మాత్రమే కాదు, దివ్యమైనది. మానవుడనగా శరీరము,

sri sathyasaivachanamrutam

మనస్సు, ఆత్మలయొక్క సమ్మిళితమైన స్వరూపమే అనే సత్యమును మనం గుర్తించాలి.

**మనస్సు ఎట్టిదో మనిషి అట్టి వాడవుతాడు**

ఈ మనస్సుకు నాలుగు విధములైన స్థితులుంటున్నాయి. దీనినే అంతఃకరణ అని కూడను చెబుతూ వచ్చారు. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము యివే దీనియొక్క వికారస్వరూపములు. అయితే ఈ నాలుగు రూపములుకూడ ఒక్క మనస్సే ధరిస్తున్నది. చేయునది దేహమైనా, తెలుసుకొనునది మనస్సైనా, వున్నది ఆత్మ అయినప్పటికి ఈ మూడింటియందు అధిష్ఠానమైన శక్తి ప్రసరిస్తూ వుంటుంది. సంకల్ప వికల్పములతో కూడినప్పుడు దీనినే మనస్సు అంటున్నాము. బుద్ధి అనగా కేవలము విచారణాశక్తితో కూడినది. ఏది మంచిది, ఏది చెడ్డది అనే విషయమును గుర్తింపచేస్తుంది. ఇక చిత్తము. నిరంతరము చింతించటమే చిత్తముయొక్క స్వభావము. ఇంక అహం అనగా ఆత్మ. ఇది సర్వత్రా నిండినది. దీనినుండి ఆవిర్భవించినదే 'అహం' అనగా నేను. ఏతావాతా ఈ నాలుగుకూడను మనస్సుయొక్క ఆకారములే! ఒకే బ్రాహ్మణుని వంట చేస్తున్నప్పుడు 'వంట బ్రాహ్మణుడు' అంటాము. దేవాలయములలో పూజ చేసే బ్రాహ్మణుని 'పూజారి' అంటాము. శాస్త్రములలో ఉపదేశమును అందించేవారిని 'శాస్త్రులు' అంటాము. పాండిత్యముతో కూడిన వ్యక్తిని పండితుడంటారు. వీరి పనులు, వీరి ఊహలు, వీరియొక్క తత్త్వము భిన్నభిన్నముగా కన్పించినప్పటికి అందరు కూడను బ్రాహ్మణులే! అదేవిధముగానే మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము ఈ పదములు అనేక రూపములతో నానాత్వమును అనుభవిస్తూ వుండినప్పటికి యివి ఆత్మయొక్క చిహ్నములే అనే సత్యాన్ని గుర్తించాలి. ఇది మనస్సుయొక్క ప్రభావము అనే దానిని మనము చక్కగా విచారించాలి. వేదాంతము 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నది. బంధమునకుగాని, స్వేచ్ఛకుగాని మనస్సే ఆధారము. ఇంతేకాదు 'మనో మూలమిదం జగత్.' మనస్సు ఎట్టిదో మనిషి అట్టి వాడౌతాడు. దీనినే 'యద్భావం తద్భవతి' అన్నారు. దీనినే ఆంగ్లములో So think of the man and so is the man. ఇలాంటి పవిత్రమైన తత్త్వము అన్ని దేశములందు కూడను సమత్వముగా ప్రకటిస్తూ, ప్రచారము చేస్తూ వచ్చినవి.

**ప్రజ్ఞాతత్త్వమే బ్రహ్మతత్త్వము**

sri sathyasai vahini amrutam

ఈ మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తములకు అధిపతి ఒకడు వుంటున్నాడు. అది లేక ఈ నాలుగు క్షణకాలంకూడను జీవించటానికి వీలుకాదు. దీనినే 'ప్రజ్ఞ' అన్నారు. ఈ ప్రజ్ఞయొక్క తత్వాన్ని మనము చక్కగా అర్థము చేసుకోవాలి. ప్రజ్ఞ అనగా మేధస్సు అని, తెలివి అని, వివేకము అని అనేక రకములుగా పేరులు పెట్టి ప్రచారము చేస్తూ వస్తున్నారు. ఇది సరికాదు. ఈ ప్రజ్ఞ తాత్కాలికమైన ప్రజ్ఞయేకాని శాశ్వత ప్రజ్ఞకాదు. వేదాంతములో వుండిన ప్రజ్ఞ స్వరూపము శరీర కణములందు, మనస్సునందు, ఆత్మయందు సమత్వమై ప్రకాశిస్తూ వుంటుంది. ఈ ప్రజ్ఞకు ఒక విధమైన శక్తి వుంది. ఈ ప్రజ్ఞాతత్త్వమును మనము గుర్తించుకున్నప్పుడే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అని తెలుసుకోగలము. ఈ ప్రజ్ఞ అనే దానికి, ఆత్మ అనేదానికి, బ్రహ్మము, సత్యము అనేదానికి భేదములు లేవు. కనుకనే దీనిని constant integrated awareness అన్నారు. అనగా అన్నింటియందును సమత్వముగా చేరినది. ఇటువంటి ప్రజ్ఞ మానవునియందు వున్నది. ఈనాటి మానవుడు తన తత్త్వమునే అనగా మానవత్వమునే తెలుసుకోలేని సమయములో యింక దైవత్వమును ఏరీతిగా గుర్తించగలడు? మొట్టమొదట మానవత్వమును సరిగా చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. మానవుడు సామాన్యమైన స్వరూపుడు కాదు. 'జంతూనాం నరజన్మ దుర్లభమ్.' యిన్నికోట్ల జీవరాసులందు ఒక్క మానవత్వమే విశిష్టతతో కూడివుంటుంది. ఇలాంటి బలమైన, విశిష్టమైన తత్త్వాన్ని మనము తెలుసుకొనుటకు ప్రయత్నించాలి. మానవునియందే సత్యమున్నది, జ్ఞానమున్నది, అనంతము వుంటుంది. అదే బ్రహ్మతత్త్వము. దీనినే 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అన్నారు. ఇలాంటి విషయాలను అనేక విధములుగా బోధిస్తూ జగత్తునందు ధర్మ సంస్థాపనార్థమై అనేక మహర్షులు పాటుపడుతూ వచ్చారు.

**ఆత్మ తత్త్వము మానవునిలో సర్వత్ర వ్యాపించి ఉంది**

ఇంకను మానవునియందు మరి మూడు ప్రధానమైన స్థానములుంటున్నాయి. కళ, తత్త్వము, మతము. ఈ మూడింటియొక్క ఏకత్వమే మానవాకారము. దీనిని గుర్తించటానికి కొన్ని రకములైన సాధనలు చేయాలి. కళ అనగా art, తత్త్వమనగా philosophy, మతము అనగా Religion. ఈ మూడింటియొక్క సమత్వము ఏమిటి? philosophy అంటే సత్యదర్శనము

అంటున్నాము. ఈ సత్యము ఎటువంటి సత్యము? చూచినది చూచినట్లుగా, విన్నది విన్నట్లుగా, చెప్పినది చెప్పినట్లుగా చేయటం సత్యమని మనము భావిస్తున్నాము. ఇటువంటి సత్యము క్షణక్షణమునకు మారుతూవుంటుంది. అయితే 'త్రికాలాభాద్యం సత్యం' అన్నారు. అన్ని కాలములందుకూడను ఇది సమత్వముగానే వుంటుంది. ఇలాంటి పవిత్రమైన మానవత్వముయొక్క అంతరార్థమును మనము క్షణక్షణమునకు జ్ఞప్తికి తెచ్చుకోవాలి. మానవునియందే బ్రహ్మతత్త్వము వుంది. మానవుడే జ్ఞానస్వరూపుడై వున్నాడు. ఈ ఆత్మతత్త్వమనేది సర్వత్రా మానవునిలో వ్యాపించి వుంటుంది. ఈ సత్యమును మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఒక శిల్పి ఒక శిలను తీసుకొని అనేకవిధములుగా మలుస్తూ వచ్చాడు. కొన్ని దినములు గడచిన తరువాత అందులో నుంచి ఒక కృష్ణుని విగ్రహమును తీసాడు. అయితే ఈ కృష్ణుని రూపము బయటనుండి వెళ్లి ఆ విగ్రహము లోపల ప్రవేశించిందా లేక రాతినుండి బయటకు వచ్చిందా? కాదు. కాదు. రాయి నిమిత్తమాత్రము. మానవుని భావనయందున్న ఒక కళ, మానవునియందున్న ఒక రూపము అందులో చెక్కి దానిని ప్రకటింపచేస్తూ వస్తున్నాడు. ఈ విగ్రహము తయారు చేయుటకు పూర్వము దాని రూపమును పూర్తిగా తన మనసులో చిత్రించుకోవాలి. ఈ విధముగా చిత్రించుకున్న తరువాతనే ఆ శిల్పి ఆ శిలనుండి ఒక విగ్రహమును తయారు చేస్తున్నాడు. ఇక్కడ రాయి ముఖ్యమా? లేక విగ్రహము ముఖ్యమా? లేక శిల్పిముఖ్యమా? శిల్పియే ప్రధానము. కనుకనే, ఈ మూడింటియొక్క ప్రధానతత్త్వమును మనము గుర్తించుకుంటే మిగిలినవన్నీ నిమిత్తమాత్రంగా రూపొందుతాయి. Experiences, Experiencer, Experience, దీనిని see, seen and seeing అన్నారు. అనగా చూచినవాడు, చూపబడినటువంటిది మరియు చూపు ఈ మూడింటియొక్క ఏకత్వమే ఈ విగ్రహము. కనుక, మానవునియందు సమస్తకళలుకూడను యిమిడి వుంటున్నవి. అందుకోసమే వేదాంత ప్రబోధకులు చెప్పారు, Heart is inside whereas art is outside. ఈ art అంతా heart నుండి వచ్చినటువంటిదే!

## ఆచరణలేని గురువులకంటె ఆచరించే భక్తులే ఉత్తములు

సమస్త సృష్టికూడను మానవునియందు యిమిడి వుంటున్నది. ఇలాంటి దివ్యత్వమును

sri sathyasai vachanamrutam

గుర్తించటానికి ప్రయత్నించినవాడే పవిత్రమైన వ్యక్తి. అట్టి మనిషికి పరులనిగాని తనదనికాని భేదము వుండదు. అప్పుడే జీవితము సార్థకమవుతుంది. సిద్ధాశ్రమము కేరళలో ప్రధానమైనది. అదే విష్ణువు వామనావతారమును ధరించిన స్థానము. భగవంతుని సాక్షాత్కారమును పొందిన స్థానము కనుక దీనికి సిద్ధాశ్రమము అనిపేరు వచ్చింది. ఇట్టి ఆశ్రమముయొక్క ప్రభావమువలనే కేరళ దేశము ప్రశాంత జీవితమును గడుపుతూ వచ్చింది. ఆనాడు దీనికి అధిపతియైన మహారాజు, ప్రహ్లాదుని మనుమడు. అతడే బలి చక్రవర్తి. ఇతని తండ్రి విరోచనుడు. ఈ బలిచక్రవర్తి పాలనలో ఆ రాజ్యములో ఎట్టి లోపములు లేక ప్రజలందరు సుఖశాంతులతో ఆనందముగా జీవించేవారు. ఆ కాలంలో రాజులు, చక్రవర్తులు ప్రజలను ప్రాణసమానముగా పాలించేవారు. అడిగినవారికి లేదనే పదము ఆ కేరళ దేశములో వుండేది కాదు. అలాంటి బలిచక్రవర్తి భక్తి ప్రపత్తులను పరీక్షింపగోరి భగవంతుడే అతని దగ్గరకు యాచించడానికి వచ్చాడు. లోకరీతిగా అడిగేటువంటివాడు చాలా అల్పుడైపోతాడు. తాను సాక్షాత్తూ మహా విష్ణువే అయినప్పటికిని యితరులను ఆశించటానికి పోతున్నాడు. కనుక అతను చాలా పొట్టివాడైపోయాడు, అనగా వామనావతారుడైనాడు. ఇతని రాకను చూచి బలిచక్రవర్తి "స్వామీ! ఎందుకోసం వచ్చారు? నా రాజ్యములో తమరికి ఏమి కావాలి? మీ సేవలు చేసుకోటానికి నాకు అవకాశమిస్తారా?" అని ప్రశ్నించాడు. అప్పుడు వామనుడు "నాయనా! నాకు ఏమీ అక్కరలేదు. మూడడుగుల స్థలము మాత్రము యిమ్మ"న్నాడు. "ఏమి స్వామీ! అనుగ్రహించి నా దగ్గరకొచ్చి మూడడుగుల భూమినా అడగటము? ఇది నాకు సంతృప్తిగా లేదు. మీకు కావలసినది ఏమైనాసరే వజ్రములో, వైఢూర్యములో, బంగారమో ఏది అడిగినా నేనిస్తాన"న్నాడు, బలి. వామనుడు నాకేదీ అక్కరలేదన్నాడు. ప్రక్కన బలిచక్రవర్తికి గురువైన శుక్రాచార్యుడు వున్నాడు. బలిచక్రవర్తికి చెప్పాడు, "స్వామీ! అంత త్వరగా మీరు మాట యివ్వకూడదు. వచ్చినవాడు కేవలము ఒక బ్రాహ్మణుడు కాదు. ఇతను బ్రాహ్మణుడని మీరు భ్రమిస్తున్నారు. అతను దైవస్వరూపుడు" అని. అందుకు బలి "ఏమైనా సరే! భూమి ఆకాశముగా, ఆకాశము భూమిగా మారినాసరే నేను నా మాటను తప్పేవాడను గాను" అన్నాడు. ఇక్కడ బలిచక్రవర్తి పదములందు చక్కగా మనము గుర్తించవలసినది ఒకటి వుంది. పండితులు పండితులని మహావిద్యావంతులుగా వుండవచ్చును. వారు అనేకమందికి గురువులు కావచ్చును. కాని

sri sathyasai vahini vacharamrutam

ఆచరణలో మాత్రము అందుకు భిన్నంగా ఉండవచ్చును. కనుకనే ఆచరించని గురువులకంటే ఆచరించే భక్తులే ఉత్తములన్నారు. గురువాజ్ఞను ఉల్లంఘించి భగవంతునికి ఏది ఇవ్వడానికైనా సిద్ధమే అన్నాడు బలిచక్రవర్తి. పైగా "అతను భగవత్ స్వరూపుడని చెప్పావు. ఈ వామన మూర్తి సాక్షాత్తు భగవత్స్వరూపుడే అయితే నేను మహాధన్యుడనైపోతాను. అలాంటి ప్రభువైన పరమాత్ముడే దాసుని వద్దకువచ్చి నాకిది కావాలని చేయిచాపినప్పుడు అతని చేయి క్రింద వుంటుంది, యిచ్చేవాని చేయి అనగా నా చేయి పైనవుంటుంది. అదే నా భాగ్యము" అన్నాడు. ఇట్టి సత్యాన్ని గుర్తించినవాడు బలిచక్రవర్తి. ఆనాడు కాలానుగుణముగా వర్షములు కురిసి, పంటలు పండి ప్రజలు ఆనందముగా జీవితము గడిపేటువంటివారు. ఇప్పటికికూడను ప్రకృతి సౌందర్యము ఒక్క కేరళ దేశమందే గోచరిస్తుంది. ఎక్కడ చూచినా అరటితోటలు, టెంకాయ తోటలు. ప్రకృతి సౌందర్యమంతా వుట్టిపడినట్లుగా వుంటుంది, కేరళదేశములో. 'అందమె ఆనందం, ఆనందమె జీవిత మకరందం' అన్నారు. అనగా ఈ అందమె మానవుని ఆకర్షిస్తుంది. ఆనందమును అందిస్తుంది. ఏమిటి ఈ ఆనందము అనగా భగవంతుడు సృష్టించిన ప్రకృతే మనకు పెద్ద బ్యూటీ. సుందరమైనది. కేరళ దేశమునందు అలాంటి చక్రవర్తి వుండటంచేత కేరళ ప్రజలు ఆనాడు సుభిక్షమైన జీవితం గడుపుతూ ఆనందమును అనుభవించేవారు.

**అహంకారమును నిర్మూలము చేసి ఆత్మ స్వరూపములో ఐక్యము చెందించడమే బలిచక్రవర్తి కథలోని అంతరార్థము**

కేరళ దేశములో మూడు అవతారములు ఉద్భవించినవి. పరశురాముడు పుట్టినది కేరళయందే! నరసింహావతారము వచ్చినది కేరళలోనే! వామనావతారము కూడను కేరళలోనే ఉద్భవించింది. చిన్న రాష్ట్రమైన కేరళయందే మూడు అవతారములుద్భవించాయి. దైవత్వమనేది, ప్రతి మానవుని హృదయమందు హత్తుకొని పోవాలి. నేడు రాజకీయముగా కేరళ రాష్ట్రములో దురాశలభివృద్ధియైపోయి ఐకమత్యమును, అన్యోన్యతను కృశింపజేసి ఆధ్యాత్మిక తత్త్వానికి ఆటంకములు ఏర్పడుతూ వస్తోంది. అయినప్పటికిని, కేరళ ప్రజలు పట్టినపట్టు సాధించటానికి దీక్షను బూని నేటివరకుకూడను ఈ ఓణం పండుగను జరుపుకుంటూ వస్తున్నారు. ఇందులో మరొక సూక్ష్మార్థము వుంది. వామనుడు మూడడుగులు దానం అడిగేటప్పటికి తీసుకోమని

చెప్పాడు బలిచక్రవర్తి. అప్పుడు వామనుడు ఒక అడుగుతో క్రింది భాగమంతా ఆక్రమించుకున్నాడు. రెండవదానితో పై భాగమంతా ఆక్రమించుకున్నాడు. మూడవ అడుగునకు స్థానము లేదు. అప్పుడు బలిచక్రవర్తి "అడిగినవాడు భగవంతుడు, యిచ్చేది నేను. భగవంతునికి దానము యివ్వటము ఎంత అదృష్టము" అని చక్కగా యోచించి, లేచి తలవంచి "స్వామీ! మీ మూడవ అడుగు యిక్కడ నా తల మీద పెట్టండి" అన్నాడు. యిందులోవున్న అంతరార్థము ఏమంటే మానవునియందు దైవత్వము, అహంకారము రెండు వుంటాయి. కనుక, అహంకారము నిర్మూలము చేసి ఆత్మ స్వరూపములో ఐక్యము కోరడమే ఈ బలిచక్రవర్తి మోక్షము. "నేను యివ్వకపోతే భగవంతుని విశ్వసించినవాడనే కాను. నా సర్వస్వము భగవంతుడే. అతడు సత్యస్వరూపుడు; కనుక, సత్యమే నాయొక్క ఆధారము" అనుకున్నాడు. అదే స్వామికూడా చెప్పుతూ వుంటారు, "సత్యమే నా ప్రచారము, ధర్మమే నా ఆచరణ, ప్రేమయే నాయొక్క స్వరూపము, శాంతమే నాస్వభావము" అని. ఏతావాతా భగవంతుడు ఏదిచేసినా అందులో ధర్మమే ప్రధాన అంశము. తనలో స్వార్థము లేదు. భగవంతుడు ఏది చేసినా స్వార్థరహితమైన పనే! భగవంతుడు ఏ విధమైన వాంఛలు లేకుండా నిస్వార్థముగా చేయటంవల్ల ఆయనను సత్యస్వరూపమన్నారు. 'ఇంతకాలము నా రాజ్యపరిపాలనలో ప్రజలే నాకు ప్రధానమని భావించాను. మానవసేవయే మాధవసేవగా విశ్వసించాను. నిన్ను నేను మరచాను. నిను నేమరచితి స్వామీ- నీ పదములనే నేమరచితి స్వామీ!" అని వాపోయాడు, బలి.

**నిను నేమరచితి స్వామీ**
**పసితనమందున తెలియక కొంత-పెరిగినపిమ్మట సంసార చింత**
**వృథా అగునయ్య ఈ కాలమంతా - నీ పదముల చేరుట నామనోచింత.**

నా చింత అంతయు నీ పాదములదగ్గర చేరుటకొరకే! బాల్యములో అజ్ఞానముచేత, పెరిగిన తరువాత వ్యామోహములో పడి కొంతవరకు భగవంతుని మరచవచ్చు. బలిచక్రవర్తిలో యిలాంటి సాత్త్విక భావములు, పవిత్రమైన భావములు, మంచిగుణములు కనిపిస్తూ వచ్చాయి. ఎవరైనా దానము, ధర్మము చేయటానికి పూనుకున్నప్పుడు ఎలాంటి పరిస్థితులయందుగాని మనము అడ్డు చెప్పరాదు. దానము యివ్వటానికి పూనుకున్న బలిచక్రవర్తిని శుక్రాచార్యులు

srisathyasaivachanamrutam

అడ్డుపెట్టటానికి వచ్చాడు. ఈ దానమునకు అడ్డుచెప్పిన కారణం చేతనే అతనికి ఒక కన్ను పోయింది. దానము, ధర్మము యిలాంటి త్యాగములో మానవుడు అభివృద్ధి కావాలి.

**దేహము పుట్టినది త్యాగముకొరకే!**

దాన, ధర్మములు లేక తనువు శాశ్వతము కాదు. మనము త్యాగము చేసుకోటానికే ఈ దేహము మనకు ఆవతరించింది. మనయందున్న సమస్త శక్తులు కూడను మనో బుద్ధి అహంకార దివ్యత్వమైన శక్తులన్నిటిని మనము భగవంతునికి అర్పించాలి. ఆ త్యాగమే మనకు యోగముగా రూపొందుతుంది. త్యాగము చేయని మానవుడే ఈనాడు కష్టములు, దుఃఖములు, విచారములు అనే రోగములలో మునిగిపోతున్నాడు. భగవంతునియందు విశ్వాసము ప్రతి మానవునికి అత్యవసరము. ఆ నమ్మకము వుండినప్పుడే మానవుడు మాధవుడుగా మారిపోతాడు. భగవంతుడు ఏది చేసినప్పటికి అంతాకూడను లోకకళ్యాణమునకే! ఆ సత్యాన్ని గుర్తించలేకపోతున్నారు, మానవులు. ఏదో తన నిమిత్తమై తాను చేసుకుంటున్నాడని భావిస్తున్నారు. తనకు ఎవ్వరూ యివ్వనక్కరలేదు. ఏ కారణముచేత నిన్ను అడిగాడో ఆ కారణమును నీవు గుర్తించుకోవటంలేదు.

**దాన, ధర్మములు త్యాగమునకు చిహ్నము**

బలిచక్రవర్తి పాతాళమునకు వెళ్లేముందు ప్రజలయొక్క ప్రేమ, అనుబంధము అతనిని చాలా అడ్డుపెట్టాయి. సత్యమే మానవునియొక్క ప్రధానమైన రూపము. Truth is God. ప్రేమయే భగవంతుని ఆకారము. కనుకనే Love is God; Live in Love అన్నారు. ఈ దానము, ధర్మము మానవునియొక్క త్యాగమునకు చిహ్నము. త్యాగము చేసినంత మాత్రమున నీకు పోయేది యేమీ లేదు. నీవు యెంత త్యాగము చేస్తావో అన్ని వేలరెట్లు నీకు అభివృద్ధి లభిస్తుంది. అయితే ఈ అభివృద్ధి కావాలనే భావముతో మీరు త్యాగము చేయరాదు. ఒక వడ్లగింజ భూమిలో నాటినప్పుడు అనేక వడ్లగింజలు పుడుతున్నాయి. ఒక విత్తనము మనము భూమిలో పెట్టినప్పుడు అది మహావృక్షముగా మారి వందల కాయలు కాస్తాయి. అదేవిధముగా స్వార్థరహితముగా ఏ అల్పమైన పదార్థాన్ని అర్పితము చేసినప్పటికిని అదియే అనంతముగా రూపొందుతుంది. భగవంతునివి, నిగ్రహ అనుగ్రహ స్వరూపాలు. కాని ఆశ, పేరాశలతో

sri sathyasai vachanamrutam

అహంకార ఆడంబరములతో కూడినది మానవత్వము. ఈనాడు భక్తికూడను ఒక వ్యాపారముగా మారిపోయింది. 'భగవంతుడా! నీకు యిన్ని టెంకాయలు కొడతాను, నా కోరిక తీర్చమంటారు. ఓ భగవంతుడా! నాకు లాటరీ పదిలక్షలు వచ్చిందంటే నీకు పదివేలు యిస్తాను' అంటారు. భగవంతునికి ఈ పదివేల రూపాయలు తక్కువయ్యా, వీడిచ్చేది? ఇందులోనే వీని అజ్ఞానం ప్రకటితమవుతుంది. 'పదిలక్షల రూపాయలు నాకు భగవంతుడిస్తే నేను పదివేలు యిస్తాను,' అంటాడు. అందించేది ఎవరు? ఇట్టి వ్యాపారంచేత మానవుడు బంధింపబడుతున్నాడు. భగవంతుని 'నీవేకావాలి, నీవుతప్ప అన్యులు నాకు అక్కరలేదు. నీవు ఒక్కడివే వుండిన జగత్తంతా నా వశమైపోతుంది' అని ప్రార్థించాలి. మనం భగవంతునికి యిచ్చేది ఏమీలేదు.

**బ్రహ్మాండమంతయు ప్రబలుచుండెడి తనకు**
**ఆలయంబు నమర్చ నలవియగునె**
**కోటిసూర్యుల కాంతి మేటిగల్గిన తనకు**
**ప్రమిద దీపము నెవరు పెట్టగలరు**
**సర్వజీవులయందు సంచరించెడు తనకు**
**సరైన పేరిడ సాధ్యమగునె**
**సర్వజలంబుల సంచరించెడు తనకు**
**స్నానంబు చేయించ సాధ్యమగునె**
**అజహరాదులకైనను అందనట్టి**
**యిట్టి తనరూపు కనుగొన నెవరితరము**

కనుక, భగవంతునికి ఎవ్వరూ ఏమీ యివ్వనక్కరలేదు. ఇవ్వవలసినది ఒక్కటే, ప్రేమ! ఆ ప్రేమకూడను నీది కాదు. భగవంతుని వరప్రసాదముగా అందుకున్న వస్తువు. తనది తనకు అర్పితము చేయటానికే యింత స్వార్థమైపోతే యిది మహత్తరమైన మీ వ్యక్తిత్వానికి లోటు. వామనమూర్తియొక్క తత్త్వమునందు, బలిచక్రవర్తి గుణములందు వున్న కొన్ని చక్కని విషయాలను మనం గుర్తించాలి. బలిచక్రవర్తి తన గురువైన శుక్రాచార్యుని సలహా విని "స్వామీ! హరుడుగానీ, హరిగానీ లేక నరుడు కాని, నా మాటను నేను తప్పను. నా జీవితము

sri sathyasai vachanamrutam

సత్యవాక్కునకు అర్పితమై పోయింది. ఇంక అతనికి యిచ్చే తీరాలి" అన్నాడు. అదేవిధంగా భగవంతునికి అర్పితము చేసే విషయములో మాత్రము మీరేమాత్రము వెనుకంజ వేయరాదు. భగవంతునికి అర్పించడమంటే నీకు నీవు అర్పితము చేసుకోవడమే! ఈ సత్యమునుకూడను బలిచక్రవర్తి ప్రకటితము గావిస్తూ వచ్చాడు. ఆడిన మాట తప్పకూడదనిది. అయితే, ఈనాటి పరిస్థితులందు విశ్వాసము చూస్తామా అంటే బాలన్సే లేకుండా పోతున్నది. అన్నింటికి doubts, doubts. సందేహములు, సందేహములు. ఇది అల్పత్వముగా రూపొందుతుంది. సంకుచిత భావముగా తెలుస్తుంది. విశాలమైన హృదయాన్ని అభివృద్ధిపరచుకోవాలి. మహాధర్మస్వరూపుడైన బలిచక్రవర్తికి విశేషమైన ప్రజాదరణ ఉండేది. సత్యము, ధర్మము. ఈ రెండు కూడను ఒకదానినొకటి పెనవేసుకున్న ధర్మములు.

### ప్రకృతి అంతా పరమాత్ముని ప్రతిబింబమే!

ప్రేమస్వరూపులారా! ఈనాడు ఓణం ఒక పవిత్రమైన దినముగా మనము భావించి పండుగగా అనుభవిస్తున్నాము. అయితే బలిచక్రవర్తి గుణములను, అతని ఆదర్శములను మనము ఆచరణలో పెట్టి భగవంతుని పూజిస్తే మరింత ఉత్తమమైన స్థితి చిక్కుతుంది. దైవస్వరూపమైన మానవత్వానికి సేవచేయక ఈ దివ్యత్వము ఏరీతిగా చిక్కుతుంది? దైవముయొక్క ఆజ్ఞను, దైవముయొక్క శాసనమును 'తుచ' తప్పక మీరు పాటించాలి. దీనినే 'ఉత్తిష్టత, జాగ్రత' అన్నారు. "చీకటి అనే అజ్ఞానములో నీవు నిద్రిస్తున్నావు. లెమ్ము! నా ఆజ్ఞ పాలింపుము." ఎక్కడ త్యాగమున్నదో అక్కడ దైవం వానికి అనుగ్రహిస్తాడు. ఈనాడు త్యాగమనేది పేరుకుకూడను కనిపించటం లేదు. స్వార్థము బాగా పెరిగిపోయింది. ఈ స్వార్థము వుండినంతవరకు దైవత్వము మనకు కనిపించదు. భగవంతునిది స్వార్థరహితమైన ప్రేమ. ఈ ప్రకృతి అంతాకూడను పరమాత్మునియొక్క ప్రతిబింబమే! ఈ ప్రకృతియొక్క శాసకుడు భగవంతుడే! ఈ భూమికి మహత్తరమైన శక్తి వుంది. ఎవరైనాసరే, కోటీశ్వరుడు కాదు, కూటిపేదకాదు, కాలుజారితే దెబ్బ తగలక తప్పదు. ఇది ప్రకృతియొక్క తత్త్వము. ఈ దేహములుకూడను ప్రకృతి యొక్క స్వరూపములే! కాలు జారిపడినప్పుడు దేహమునకు దెబ్బలు తగులుతుంటాయి. అంతమాత్రముచేత మనము దీనికి విచారించరాదు. ఇది ప్రకృతియొక్క

తత్త్వము. అందులోనే వుంటుంది, భగవంతుని తత్త్వము. అయితే భగవంతుడు నిగ్రహించగలడు, భక్తుడు నిగ్రహించలేడు.

**భగవంతుడుకూడా ప్రకృతి శాసనమును అనుసరించే తీరాలి**

మీకు తెలుసును. స్వామి ఈ నాలుగు దినములనుండి క్రిందకు రాలేదని అనేకమంది అనేక అభిప్రాయములను మనసునందుంచుకొని బాధపడుతున్నారు. నిజముగా విచారిస్తే స్వామియొక్క నిగ్రహశక్తి ఎలాంటిది అనేది మీకు అర్థమవుతుంది. బాత్‌రూమ్‌లో సోప్ కాలిక్రింద పడింది. నాయొక్క స్వభావమేమంటే రాత్రి అందరికి నమస్కారము యిచ్చి పంపిన తరువాత డోర్ నేనే వేసుకొని బోల్టు వేసుకుంటాను. తెల్లవారి నా కాలకృత్యములన్నీ తీర్చుకొని స్నానము చేశాక నేనేవచ్చి ఆ తలుపులు తీస్తాను. అలాంటి పరిస్థితిలో ఏదో జారిపడిపోయాను. ఇది ప్రకృతియొక్క నియమము. క్రిందపడితే దానియొక్క స్వభావము స్వభావమే! అగ్ని వేడిగా వుంటుంది అంటే యిది విచిత్రము కాదే! వేడి అగ్నికి సహజము. ఐస్ చల్లగా వుంటుంది అంటే చల్లదనము దాని స్వభావము. నేను పడినా, మీరుపడినా ఎవరు పడినాకూడను, ఈ దెబ్బ తగలక తప్పదు. ఇది ఎలాంటి శాసనమంటే, ఒక IG Police వుంటాడు. ట్రాఫిక్‌బోర్డులో అనేక నియమాలు నియమిస్తారు. ఈ పోలీసువారే ఈ చట్టాన్ని నియమించారు. ఒక circle దగ్గర keep left అని వ్రాసి వుంటారు. ఈ శాసనమును ఎవరిచ్చారో ఆ అధికారికూడను leftలోనే పోవాలి, కాని rightలో పోకూడదు. అదేవిధముగా భగవంతుడు ప్రకృతికి అందించిన చట్టమును తానుకూడా అనుసరించే తీరాలి. అది ఆచరించే సమయములో యిలాంటి కొన్ని యిబ్బందులు కలుగుతూ వుంటాయి. స్వామి నిగ్రహమంటే ఏమిటో మీకు తెలుసును. దేహమునంతాకూడను నిలబెట్టి నిలబడగలిగే శక్తినిచ్చేది, ఈ జాయింట్. దీనిని హిప్ అంటారు. నేను బాత్‌రూములో పడిన తక్షణమే ఎవరు లోపలకు రావటానికి లేదు బోల్టు వేసుకున్నాను నేను. నన్ను నేను నిగ్రహించుకొని లేచాను. లేచి బోల్టు తెరిచాను. మీరు ఆనందించవలసిన విషయములేగాని స్వామి నిగ్రహమునకు బాధపడరాదు. కాలుజారి క్రింద పడిన తక్షణమే తల పడిపోయింది. Straightగా నిల్చున్నవాడిని నిల్చుకున్నట్లుగా పడిపోయాను. అలాంటి పరిస్థితిలో రాధాకృష్ణ చూసి (నావెంట వుండే విద్యార్థి) డాక్టర్నును పిలుచుకువచ్చాడు. 'నాకు తెలుసు. మీరేమీ చూడనక్కరలేదు. నేను అనుభవించే తీరాలి. నేను తప్పక నిగ్రహించుకోవాలి.

srisathyasaivachanamrutam

ఇది ఒక ఆదర్శము My life is my message.’ అని నేను వారికి చెప్పాను. డాక్టర్లు X-ray తీయాలన్నారు. డా॥ చారి, డా॥ కృష్ణమూర్తి యిద్దరు కూడను ‘స్వామీ! ఏదైనా ఒక చిన్న X-ray మిషను తెప్పించి యిక్కడైనా చూడవలసిందే తప్ప మేము వదలము’ అని ప్రార్థించారు. వారి బాధను చూసి ‘సరే! మీ యిష్టం! చేసుకోండి!’ అన్నాను. వెంటనే బెంగుళూరుకు ఒక లైటినింగ్ కాల్ బుక్ చేసేసరికి నిముషాల్లో వచ్చింది. వెంటనే X-ray plant తీసుకుని వచ్చారు. తీసేటప్పటికి యిది విరిగిపోయింది. ఆ విరిగిపోయిన ఎముక దగ్గర ఎవరైనా టచ్ చేయటానికిగాని, కదలించటానికిగాని వీలుకాదు. అనుభవించినవానికి మాత్రమే తెలుసు. డాక్టర్సుకు మాత్రమే తెలుసు. దీనికి మా డాక్టర్సు చెప్పారు, ‘నాలుగు వారములు bed restలో వుండాలి’ అని. నాకు rest అంటే ఏమిటో తెలీదు. నాకు rest కావలసిన అవసరము లేదు. నా పనులు నేను చేసుకుంటానన్నాను. కాని డాక్టర్లు, భక్తులు యింకా అందరూ వున్నారు. గోపాలరావు వచ్చాడు. నరసింహన్ వచ్చాడు. వీరందరు చూసి ‘స్వామీ! తప్పక rest తీసుకోవాల’న్నారు.

**లోకానికి ఆదర్శము నిరూపించే నిమిత్తము దైవము ఎంతటి నిగ్రహమైనా పాటించగలడు**

“కేరళనుండి యిన్నివేలమంది భక్తులు భక్తిప్రపత్తులతో ప్రశాంతి నిలయము చేరితే నేను లోపలకూర్చోటం నాకు ధర్మం కాదు. అందరిని సంతోషపెట్టే నిమిత్తమై నేను తప్పక వారిని చూస్తాను” అన్నాను. అయితే ఈ నొప్పి అనేది మానవమాత్రుడు సహించలేడు. చాలామంది నాకు letter వ్రాసారు. “స్వామీ! తమకు సంభవించిన ఈ వ్యాధిని త్వరగా నివారణ చేసుకోవాలి” అన్నారు. నాకు ఎట్టిరోగము లేదు, రాదు. ఏదో ఈ విధముగా జరిగిందేతప్ప నాకు ఎప్పుడూ వ్యాధులనేవి లేవు. స్వామికి జబ్బు చేసింది, జబ్బు చేసింది అంటే జబ్బు చేయటం ఏమిటి? నాకు జబ్బేలేదు. నా పనులు నేను యిప్పుడుకూడా చేసుకుంటూనే వున్నాను. సోఫామీద కూర్చోటము, తెల్లవారి వచ్చిన మూడు, నాలుగువేల జాబులన్ని చదవటము, అదే నా rest. నేను కూర్చునేది, పండుకునేది, భోజనము చేసేది అన్నీ ఒక సోఫాలోనే యిప్పుడు. కాలు క్రిందపెట్టటానికి వీలుకాదు. ఇంత కఠినమైన బాధను నవ్వుతూ నవ్వుతూ నేను నిగ్రహిస్తున్నానంటే యిదే సరైన ఆదర్శము. ఇంకా కొంతమంది ఆలోచిస్తున్నారు, “స్వామి

srisathyasaivachanamrutam

భూత భవిష్యద్వర్తమానములను గుర్తించినవాడు కదా! భవిష్యత్తులో ఏమి జరుగుతుందో స్వామికి తెలియదా" అని, కొంతమంది ప్రశ్నించుకుంటున్నారు. భవిష్యత్తుకాని, గడచిపోయిన కాలముగాని నేనేమాత్రము విచారించను. కనుకనే భక్తులకుకూడను నేను బోధిస్తూ వుంటాను "Past is past forget the past. దానిని ఆలోచించటము మానివేయి. Fuline is not sure. Do not think of the future. ఈ futureని గురించి యోచించకూడదు. గతమును యోచించకు. వర్తమానాన్ని పెట్టుకొని నీవు బ్రతుకు" అని. అదేవిధముగా నేను భవిష్యత్తును ఎప్పుడూ యోచించలేదు. ఒక చిన్న ఉదాహరణము. రామావతారములో రేపటి దినము సూర్యోదయములోపల రాముని పట్టాభిషేకము జరుగుతుందని ఒక వార్త వ్యాప్తిగాంచింది. తెల్లవారి పట్టాభిషేకము చేయించుకోవలసిన సమయములోపల రాముడు సర్వసంగ పరిత్యాగియై అడవులకు వెళ్లాడు. ఇక్కడ ఒక చక్కని ఆదర్శమును మీరు గుర్తించాలి. అట్టి సమత్వాన్ని ఒక్క దైవముతప్ప యితరులు పాటించలేరు, అనుసరించలేరు. దైవము యేమైనా చేయగలడు. ఈ నిగ్రహమువలన యెంతబాధ వుండినప్పటికి దానిపైన మనసు పెట్టలేదు. దానిపైనే మనస్సంతా వుంటే ఇంకా ప్రమాదమై పోతుంది. ఇంకా బాధ ఎక్కువౌతుంది. మనస్సును మరల్చటమే ఈ బాధకు సరైన మందు. కదలినప్పుడు పెద్ద shock కొట్టినట్లుగా ఉంటుంది. అటువంటి సమయంలో భక్తులు వ్రాసిన letters తీసుకొని చదువుతూ వుంటాను.

**ఆత్మచింత సుఖమును, దేహచింత దుఃఖమును అందిస్తాయి**

'దీనిని స్వామి ఒక్క క్షణములో బాగుచేసుకోవచ్చు కదా', అని భక్తులు ఆశిస్తూ వుంటారు. నేనంత స్వార్థపరుడనుగాను. ఇతరులకు దెబ్బతగిలితే నేను తక్షణమే వారికి నివారణ చేస్తున్నానా? దీనికి కొంతకాలమని వుంటుంది. కాలము తీరేవరకు దానిని అనుభవించవలసినదే! అయితే, ప్రార్థనలచేత ఆ బాధను నిగ్రహించుకోవచ్చు. ఈ ప్రాకృతములోపల ఏమి జరిగినప్పటికిని mindను మరల్చుకోటానికి ప్రయత్నించాలి. మనస్సును దుఃఖముపైనా, విచారముపైనా ఏమాత్రము ప్రసరింప చేయకూడదు. ఆత్మచింత సుఖం, దేహ చింత దుఃఖము. అందువలన దేహ నిమిత్తమై మనము worry కారాదు. ఈ దేహమునందు నిమిష నిమిషమునకు నీచులూరునెగాని పునుగు జవ్వాదీలు పుట్టబోవు. దేహబాధలు వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. నా బాధను నేను వెంటనే నయము చేసుకుంటే 'సాయిబాబా ఎంత

sri sathyasai vahini vachanamrutam

స్వార్థపరుడు, తన బాధకాబట్టి నివారణ చేసుకున్నాడు, ఇతరుల బాధను నివారణ చెయ్యటం లేదు' అంటారు. మీ దేహబాధగాని మరి ఏ దేహబాధగాని దానికి ఉపశాంతి చేసి, నిగ్రహము నేర్పి, బలము నందించవచ్చునేగాని దానిని నివారణ చేయకూడదు. ఎంతకాలము వుండాలో అంతకాలము వుంటుంది. తరువాత అది నయమైపోతుంది. ఈ నాలుగు దినములనుండికూడా ఈ మనస్సే దానిపైన లేదు. నేను ఏ కార్యక్రమములు పెట్టలేదు. కానీ అనేకమంది భక్తులు కోరటంచేతనే నేను బయటకు రాకుండా వుంటున్నాను.

ఒక్కొక్క సమయములోపల నేను మరొకరి బాధను తీసుకుంటాను. నా ఆనందము కోసము ఈ troubles తీసుకొంటున్నానుగాని యిందులో force లేదు. కాని, అన్నింటియందు మానసిక control అత్యవసరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. బలిచక్రవర్తి ఆశయాలను ఆచరించి అనుభవించవలసిందేగాని ఈ పండుగనాడు ఏదో పాయసము, పరమాన్నాలు చేసుకోటమని కాదు. అతను ఆచరించినది సత్యము. అతను చూపినది సత్యము. అతను చేసినది త్యాగము. ఈ త్యాగము, సత్యము మనము మన జీవితములో సమన్వయము చేసుకొని, వీటిని ఆచరణలో పెట్టాలి. ప్రజలను విడిచిపెట్టేముందు "ప్రతి సంవత్సరము శ్రావణమాసములో శ్రవణ నక్షత్రము తిథికూడా చేరినప్పుడు నేను తిరిగి వస్తాను", అన్నాడు. దాని జ్ఞాపకార్థమై కేరళ ప్రజలంతా అతన్ని ఆరాధించటము, అతనిని ప్రసన్నుని గావించుటకొరకు చేసుకొనే పండుగకే 'ఓణ'మని పేరు.

**మనస్సును నిగ్రహించుకోవడానికి ప్రయత్నించండి**

ప్రేమస్వరూపులారా! ఏ విధమైన బాధలు వచ్చినప్పటికి మీరు లెక్కచేయకుండా మనస్సును మార్చుకోటానికి ప్రయత్నించండి. అదే My life is my message. అది చూపే నిమిత్తమై యిన్ని విధములైన నిగ్రహములను ప్రదర్శిస్తున్నాను. శరీరము, మనస్సు, ఆత్మ ఈ మూడింటి సమ్మిళితమైన స్వరూపమే మానవత్వమని గుర్తించండి. దేహము లేకపోతే మనస్సు, ఆత్మకూడా గోచరము కావు. మనస్సు లేకపోతే శరీరము, ఆత్మలు ఏమాత్రము అర్థము కావు. ఆత్మ లేకుండా వుండటానికి వీలులేదు. అదే అన్నింటికిని మూలాధారమైనది. కనుక ఈ మూడింటిని

srisathyasaivachanamrutam

మనము చక్కగా సమన్వయము చేసుకొని సత్యమైన జీవితములో ప్రవేశించాలి. మనము కాలమును వ్యర్థము చేయరాదు. చాలామంది పిల్లలు హాస్టలునందు, ప్రైమరీస్కూలునందు స్వామికోసమై ప్రార్థనలు చేస్తూ వచ్చారు. స్వామి బాగుకావాలంటే ఏ దేవతలను ప్రార్థించాలి అనుకుంటూ ఈ సందిగ్ధావస్థలో భక్తులు అందరు దేవతలను ప్రార్థిస్తున్నారు.

### భక్తుల ఆనందమే నా ఆనందము

విద్యార్థులారా! ప్రజలారా! ఇది కేవలము ప్రార్థనలచేత సరిపోయేది కాదు. మీరు ఏనాడు స్వామియొక్క తత్త్వాన్ని, సత్యాన్ని గుర్తించుకుంటారో ఆనాడే మీకు ఈ విధమైన బాధలు అంటవు. స్వామి సర్వదేవతా స్వరూపులు కదా అని మా హాస్టలులో MBA పిల్లలు గాయత్రి మంత్రము చేస్తూ వచ్చారు. ఈ సమయములో వీరి మనస్సులు వీరి బుద్ధులు ఏ విధముగా చలిస్తాయో, ఏ విధముగా భ్రమిస్తాయో చూడాలి. ఇలాంటి భావాలు మీకు అప్పుడప్పుడు రావటము దానికి తగిన నివారణ చేసుకోటము, ఈ విధముగా ప్రశాంతమైన జీవితాన్ని గడపాలి. స్వామి దయాప్రేమలు మీపై నిండుగా దండిగా వుంటున్నాయి. కాకపోతే నన్ను తక్షణమే బెంగుళూరు తీసుకుపోవాలని ప్రయత్నించారు. నేను చెప్పాను, 'కొన్నివేలమంది కేరళా భక్తులు వస్తుంటే నేను తప్పించుకొని వెళ్లటం సాధ్యము కాదు, నేను వెళ్లను' అని. భక్తుల ఆనందమే నా ఆనందము. నాకు ప్రత్యేకమైన ఆనందము లేదు. నేను కోరను. ఈ దేహమును ఎందుకు లక్ష్యము చెయ్యాలి? మరొకటి మీరు గుర్తించాలి. ఈ దేహము నాది కాదు, ఇది మీది. కనుక నేను దీనిలో ఏమాత్రము ప్రవేశించకూడదు. ఈ దేహము నాది, నాది అన్న భావమున్నప్పుడే అనేక విధమైన బాధలు కలుగుతాయి. భక్తుని హృదయములో ప్రతిష్ఠింపబడి వున్నవాడు భగవంతుడు. కనుక భక్తులైనవారు యిలాంటివి నేడు కాదు, రేపు కాదు, ఎన్నటికి స్వామిని బాధపెడతాయన్న అనుమానానికి చోటుయివ్వకండి. ఎటువంటి బాధలు నన్ను ఏనాడూ బాధించవు. అయితే దేహరీతిగా ప్రాకృతమైన దానిలో వస్తుంటాయి, పోతుంటాయి. అవి passing clouds. కనుక దైవత్వాన్ని చక్కగా అర్థము చేసుకొంటే "అయ్యో! ఈ బాధలే, స్వామి ఈ విధముగా కష్టపడుతున్నారే, ఈ medicine తీసుకోవాలే స్వామి", అన్న భావాలే రావాలి. అయితే భక్తి వుండటముచేత, స్వామిపైన అమితమైన ప్రేమ వుండటం

sri sathyasaivachanamrutam

చేత భక్తులు యెంతో వాత్సల్యముతో, ప్రేమతో "మీరు rest తీసుకోండి స్వామీ rest తీసుకోండి" అని చెప్తూతూ వుంటారు. నాకు రెస్టువద్దు. 'నేను ఎప్పుడూ అరెస్టు!' అరెస్టు అనగా రెస్టు లేకుండా వుండటమే! అది నా message. దానిని నేనుకూడా ఆచరిస్తున్నాను. ఇప్పటికికూడా నేను rest తీసుకోటం లేదు. మీకు తెలియకపోవచ్చును. డాక్టర్లు కదలకూడదని చెప్తూతే, నేను ఐదుగంటలకే లేచి పళ్లు తోముకోటము, కాలకృత్యములు తీర్చుకోటము, స్నానము చేయటము అన్నీ జరిగిపోతూనే వున్నాయి. అందువలన అందరూకూడా ఆనందముతో మీమీ బాధలు మరచి సాధ్యమైనంతవరకు వుల్లాసంగా కాలము గడపండి. స్వామికి ఏమాత్రము బాధలు లేవు. శారీరకముగా యిలాంటివి వస్తుంటాయి, పోతుంటాయి. తల క్రింద పడటంచేత తల పగిలిపోవాలి. మీకు యథార్థాన్ని చెబుతున్నాను. ఆ మొజాయిక్ ఫ్లోర్‌పైన తల టప్ అని పడిపోయింది. పెద్ద శబ్దము వచ్చింది. డాక్టరు కృష్ణమూర్తి చెప్పాడు 'స్వామీ! ఫోటో తియ్యాలి. తల వాచింది, సరైన పరిస్థితిలో లేదు' అని. నా తల వాచిందని యెవ్వరికి తెలియదు. నాకు అక్కరలేదని చెప్పాను. భక్తులకు ఏమాత్రము సంతోషమియ్యలేకపోయానే అన్నదే నా బాధ. కనుక అన్నింటిని నిగ్రహించే శక్తి స్వామిలో వున్నప్పుడు యిది బాధ అని మీరు యెట్లు తలుస్తున్నారు? స్వామి బాధపడుతున్నాడే అని దేహరీతిగా భావిస్తున్నారేగాని ఆత్మవరకు ప్రయాణము కావటం లేదు. 'స్వామికి ఏదీ జరగదు. ఏదీ ఆవదు' అన్న ధైర్యముతో వుండాలి.

**స్వామికి ఏ బాధలూ లేవు!**

ఈ ప్రతి ఒక్కటికూడా భక్తులకు అందించే ఆదర్శాలే! కష్టము వచ్చినప్పుడు మీరు యేడ్వనవసరము లేదు. సుఖము, దుఃఖము ఎక్కడనుండి పుట్టినవో దానిని లక్ష్యములో పెట్టుకోవాలి. సుఖముగాని, దుఃఖముగాని మనను ఆనందపెట్టేవి కాదు. కానీ, మానవులు సుఖాన్ని ఆనందాన్ని స్వాగతం చేస్తారు; దుఃఖాన్ని బాధలను send off చేస్తారు. ఐతే, స్వామిలో వున్న తత్త్వము సమతత్త్వమని మీరు తెలుసుకోవాలి. ఈ రెండింటికి స్థానమే హృదయము. హృదయాన్ని కంట్రోల్ చేసుకుంటే ఈ బాధలు మనలను ఏమాత్రము బాధించవు.

కనుక, నిరంతరం మీరు నామ సంకీర్తన చేయండి. స్వామికి బాధ కలిగిందే అని జపములు, ధ్యానములు చేస్తే ప్రయోజనము లేదు. ఇది artificialగా వుంటుంది, స్వామికి

srisathyasaivachanamrutam

బాధలు యేనాటికి వుండవు. 'నేను నటన చేస్తున్నాను', అన్న సత్యాన్ని మీరు గుర్తించాలి. ఈనాడు వరలక్ష్మి వ్రతముకూడ! ఇది శ్రావణ శుక్రవారము. ఈ విధంగా చాలా పవిత్రమైనవి చేరినవి.

దేహానికి యిటువంటివి వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. మీరు వీటిని లెక్క చేయకూడదు. నేను అసలే లెక్కచేయను. మరొక చిన్న ఉదాహరణ. ఇంతసేపు యిక్కడ నిల్చుని వుండటమే పెద్ద miracle. కాళ్లు లాగుతున్నాయి. కావలసినంత బాధ వున్నది. కానీ నేను మీతో సంభాషిస్తూ వుండటమువలన నాకు యేమీ బాధ తెలియటము లేదు. కనుక మీరుకూడా కష్టములందు, బాధలందు, దుఃఖములందు మనస్సును మరొకవైపుకు మరల్చటానికి కృషి చెయ్యాలి. అది మీకు నేర్పించే నిమిత్తమే నేను ఈనాడు మీతో మాట్లాడుతున్నాను.

నిరంతరము, సర్వదా, సర్వకాలములందు భగవంతుని నామ సంకీర్తన చేయండి. అందరూ కలసిమెలసి జీవించండి. నామము అమృతముకంటె అతిరుచ్యమైనది. ఆ మధురమైన నామాన్ని నాలుకపైన నాట్యమాడించండి. స్వామికి ఏ బాధలు లేవు. మీరు యేమాత్రము విచారించనక్కరలేదు. కేరళ ప్రజలు ఏమాత్రము బాధపడకూడదు. మూడు దినములు స్వామి దర్శనము దొరకలేదని బాధపడినారు. వుత్తమ భావాలను పెంచుకోండి. లోకసేవ చేయండి!

**(తేదీ. 26-08-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam